

**“ఒరే మాదవా! మోసేవాడికి తెలుస్తుంది కావడి బరువు, మొండికెయ్యకుండా మీ అయ్య చెప్పినట్లు విను” సర్ది చెప్పాడు శంకరయ్య.**

**వాడివాలకం చూస్తే వినేటట్లు లేదు. “అది కాదు తాతా! ఆయన మొయ్యొద్దు దించొద్దు, నా భాగం నాకు పారేస్తే నా బాధ నేను పడ్తాను.”**

కళ్ళు పూర్తిగా తెరవని పిల్లకాకి, మీసాలింక మొలవనే లేదు. వాడు భాగమడుగుతుంటె శంకరయ్యకు ఆశ్చర్యమేసింది.

# [illegible]

**- పిడుగు పాపిరెడ్డి**

“ఇదీ మామా వరుస. మాట్లాడితె నా బాగమంటడు. బాగమిస్తే వాడేంచేస్తడు. ఆ భాగంతో చదువైద్దా? నౌకరొస్తదా? అటు అది రాక ఇటు పనికిపోక ఈడు రెండందాల చెడతాడని నా బాద.”

“నా బాద కూడ విను తాతా!” ఎంతకాలం వ్యవసాయం చేసినా ఏమొస్తది? అప్పులు తప్ప. పదవ తరగతి ఫస్టులో పాసైనా. చదువుకోరా, బాగు పడతావని పంతులందరు చెబుతుంటె, ఈయనేమొ తను తెగించి చదివించలేడు, నాది నాకియ్యమంటె ఒప్పుకోడు. నువు ఇట్టా అనుకుంటె క్రిష్ణ మామ అంత చదువు చదివేవాడా, అమెరికాకు వెళ్ళే వాడా, కావాలంటె ఇవాళ ఈ వూరినంతా తిప్పి కట్టిస్తాడు.”

కొడుకు మాట వినేసరికి శంకరయ్య గుండెలో కొత్త వసంతమొచ్చింది. మాధవ నోట కొడుకు మాట కోకిలపాటగా విన్పించింది. మనసు ఒక్కసారిగా మారిపోయి మనవడి కోపుపట్టాడు. “ఒరే సుబ్బయ్య! వాడు చెప్పేది కూడా బాగానే ఉందిరా. ఇంటర్ చదివించు. ఆ తర్వాత ఆలోచిద్దాం.”

సుబ్బయ్యకిది సుతరాం నచ్చలేదు. “జమీందార్లాంటి మీతో పోటీ పెట్టుకుంటె ఎట్టామామా, ఇల్లు జరిగెదెట్టా, పెట్టుబడికెట్టా అని కొటకలాడుతుంటే వాడ్ని పట్నం పంపించమంటవు. చదువంటే మాటలా!” శంకరయ్య ఒక నిశ్చయానికి వచ్చాడు.

“పట్నంలో నాకు తెలిసిన పంతులున్నాడు. ఆయన పనిచేసే కాలేజిలో వీడ్ని చేరుద్దాం. అన్నం పెట్టే ఏర్పాటుచేస్తా. చదువుకు పెట్టుకో, ఇంటర్ అయితే ఆ తర్వాత చూద్దాం రా సుబ్బయ్య”అన్నాడు శంకరయ్య.

కొడుక్కు బతుక్కు ఒక మార్గం దొరికినందుకు మనసులో సంతోషపడ్డా, ఆ మాత్రమైన తను పెట్టుకోగలనా అనే సందేహంతో తటపటాయిస్తూనే తలూపాడు సుబ్బయ్య. మాధవకు ఏనుగు యెక్కినంత సంతోషమైంది. శంకరయ్యకు దండం పెట్టి తండ్రి కొడుకులిద్దరు తృప్తిగా వెళ్ళిపోయారు.

శంకరయ్య మనస్సు సంతోషంతో నిండిపోయింది, అవును పిల్లలందరు చదువుకొని వృద్ధిలోకొస్తే ఊరు బాగుపడతది. అదే తను కోరేది అనుకున్నాడు శంకరయ్య.

ప్రక్కనే ఉన్న వెంకటయ్యను పిలిచి, “ట్రాక్టరు తీసుకొని చేలోకి పొయ్యి దుక్కిదున్నరా, తడారిపోతే దుక్కి రాదు” అన్నారు శంకరయ్య. నెత్తి గీరుకుంటూ నిలబడ్డ నాగయ్యను చూసి “నీవేందిరా అట్లా నిలబడి పొయ్యావు?” అడిగాడు.

**ఉగాది పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

“ఏం లేదు పెదయ్య! గోపాలుగాడు రేపు యేతమేస్తడంట. వాడు యేస్తే నా చేలోకి పోడానికి దారుండదు. ఇయ్యాల ఎయ్యకుంటే నా చేను బీడే. అందుకని ట్రాక్టరు అడుగుదామని వచ్చినా.”

“ఒరేయ్, బలె పితలాటకం తెచ్చి పెట్టినవే. ఎట్లామరి ఒకనాటి అదును ఒక యేటికిరాదని. మా చేను ఆరిపోతుందే ఏం చెయ్యాలబ్బా!” శంకరయ్య ఆలోచనలో పడ్డాడు.

“ఏం చెయ్యాలన్నా నువ్వే పెదయ్యా” అన్నాడు నాగయ్య బాధగా.

“సరిసరే, ఒరే వెంకటయ్య! వీడు నాగయ్య బాదపడ్తున్నాడు. వాడి చేను యేసి మాపటాల మన చేలోకి పోరా” అన్నాడు శంకరయ్య. నాగయ్య నెత్తి మీద బండ క్రిందికి దించినట్లుంది. పెద్దయ్య వైపు కృతజ్ఞతతో చూసి సంతోషంగా వెళ్ళిపోయాడు నాగయ్య.

పార్వతమ్మ వచ్చి పక్కన నిలబడింది. “తనకుమాలిన ధర్మం పనికిరాదని, ఇదేమిటి వాడి చేనికోసం మన చేను బీడు పెట్టుకుంటామా, పోయినేడు ఇట్లాగె కొంత బీడాయె. ఈయేడైనా కాలమైనప్పుడు ఏసుకోకపోతే ఎట్లా? మనం నిలబడితెగదా పక్కోల్లను నిలబెట్టేది” అంది.

“ఏం చేద్దాం? పిల్లలుగల్లోడు వాడు బాధపడ్తుంటే మనం చూస్తూ ఉండగలమా!”

“బాగుంది వరస, ఊర్లో ఎవరికేదొచ్చిన అది మన తప్పేనా! అది తీర్చాల్సిన బాధ్యత మనదేనా! వాడికి అన్ని మొక్కలు పెరగనివ్వాలి. ఏ మొక్క ఏ పూలు పూస్తుందో ఎవరికి తెలుసు.

"చదువన్నావు, వీడికి పొలమన్నావు. ఇలా తలాఒకటి అందిస్తూ కూర్చో, ఆ తర్వాత తిందువుగాని" అంది పార్వతమ్మ నిష్ఠూరంగా. పార్వతమ్మ నిష్ఠూరం అల్లం వేసిన టీలా తియ్యతియ్యగా, కారకారంగా వుంటుంది. అందుకే పార్వతమ్మ నిష్ఠూరం శంకరయ్యకు చాలా ఇష్టం.

"నీవు మాత్రం తక్కువా పార్వతీ! ఆయమ్మ ఈయమ్మ పక్కన చేరి పప్పులోకి ఉప్పనో, పాలలోకి పంచదారనో అంటే అరువుతెచ్చి అయినా వారికి సాయ పడుతుంటావు. ఇదేందే ఇల్లుగుల్ల చేస్తున్నావంటే 'పాపం! లేకే కందండి నోరు తెరిచి అడిగేది ఇట్లాంటి చిన్నచిన్నవి తప్ప నేనేం చేయగలను, సత్రాలు కట్టిస్తానా! చెరువులేయిస్తానా!' అంటావు."

ఇట్లా ఒకరికొకరు నిజంగా నిష్ఠూరమాడుకుంటున్నారో లేక పరుల బాధలను పంచుకొనేందుకు మనసులను కూడదీసుకుంటున్నారో తెలియదు. కాని ఎవరికి వారు తోడుదొంగల్లా యితరులకు సహాయపడడంలో పోటీ పడుతుంటారు.

పక్క బజారులో రామచంద్రయ్య యింటిలో ఏదో గోలగా వుంది. జనం చాలా మంది చేరారు. శంకరయ్య వెళ్లి "ఏందిరా"అని అడిగాడు.

"చూడు చిన్నాయనా! ఇదేం పనిచేసిందో"అంటూ పెళ్ళాం మీదకు దూకుతున్న రామచంద్రయ్యను చెంచయ్య ఆపుతున్నాడు.

"ఏందే కోడలుపిల్లా ఏంజేశావు?" అన్నాడు శంకరయ్య. "చూడు మామా! ఈ చెంచన్న చెబితే రాత్రి మినపాడలు చేసి పెట్టినా. పొద్దున్న లేచి కొట్టనుమొదులు పెట్టిండు" అంది.

"ఇత్తనాలకు తెచ్చిన మినుములు వడలు చేసింది చిన్నాయనా. యీడు యితండపోడు చెబితే మాత్రం ఆలోచించొద్దా? ఇప్పుడు యిత్తనాలెట్లా?" ఆగ్రహంతో ఊగిపోతున్నాడు రామచంద్రయ్య.

"అట్లెందుకు చేసినావురా చెంచయ్యా?" అడిగాడు శంకరయ్య.


"ఆ! ఏం లేదు మామా! వీళ్ళిద్దరూ ఎప్పుడు కుసుకుసుమంటూ కూనీరాగాలు తీస్తూ బలే కుశాలుగా వుంటుంటే అయినా చూద్దామని ఒక పుల్ల గీసేసా. అంతే తాటాకు కొంపలా తగలబడింది."

"ఇదేం కుశాలరా, తప్పుకాదూ?"

"అందుకే కదా మామా! అరగంట నుంచి అక్కమీద కమరబడుతున్న రాం బావను ఆపుతూ కూర్చున్న"అన్నాడు చెంచయ్య.

"ఆపడంకాదోయ్, యిత్తనాల సంగతి తేల్చు" రామచంద్రయ్య నిలతీస్తుంటే ఏమీ తోచక అందరూ దిగాలుగా నిలబడిపోయారు.

శంకరయ్య నవ్వి "నువ్వు బలేవాడివిరా చెంచులు. కోడలు పిల్ల కుతిక మీదికి తెస్తివే ఎట్లా?" అంటూ "ఆ గుర్తొచ్చింది, మా యింట్లో వుండాల, మీ అత్త దగ్గరకు పోయి తెచ్చుకో పోయే పిల్ల"అన్నాడు శంకరయ్య. బతుకు జీవుడా అంటూ పరుగెత్తింది కోటమ్మ. "అత్తత్తా మినుములుండయంట, రెండు కేజీలీయ్యత్తా, ఇయ్యాల మా మామ దేవుడాలవచ్చి నా మానం కాపాడిండు" అంది.



ఆ వూరిలో అందరూ కులమతాలకతీతంగా అన్న, అక్క, అత్త, మామా అంటూ వరుసలు కలుపుకొని ఆప్యాయంగా పిలుచుకుంటూ వుంటారు. వాస్తవంగా శంకరయ్య వాళ్ళకేమీ కాడు, కాని అందరూ ఆయన బంధువులే.

"ఏమైందే నీ మానానికి?" అడిగింది పార్వతమ్మ.

"ఏముంది, ఆ చెతురు చెంచన్న వచ్చి 'మినుములున్నాయంటక్క, యిసిరి వడలు చేసి పెట్టమన్నాడు బావ'అని నవ్వకుండా చెప్పేసరికి నేను నిజమనుకొన్నా. వడలు చేసి నేతికారమేసి పెడితే కమ్మగా తిని, పొద్దున లేచి నా కుతిక పట్టుకున్నాడత్తా నీ కొడుకు. అవి యిత్తనాలకు తెచ్చిన మినుములంట. నాకేమి తెలుసు. మా మామ వచ్చి సమయానికి సెక్కరం అడ్డమేసిండు" అంది.

పార్వతమ్మ పకపక నవ్వింది. కళ్ళల్లో నీరూరింది. కోటమ్మ కథకు నవ్వు, చేను బీడుబడుతదే అనే వ్యధతో కన్నీళ్ళు. కోటమ్మ మానం మామ నిలబెడితే, మామ మానం నిలబెట్టడానికి పార్వతమ్మ మినుములు యివ్వక తప్పలేదు.

ఆ యేడు చేను బీడే.

యేటికేడు దిగదుడుపు అవుతున్న తీరుచూసి పార్వతమ్మ నిట్టూరుస్తూ "ఇట్లయితే ఎట్లా" అంది.

"మనకేమే జమీందారులం. పది ఎకరాల మామిడి తోట, పదిహేనెకరాల మాగాణి, పాతికెకరాల మెట్ట. వ్యవసాయానికి కొత్త వరవడి దిద్ది రాజనాలు పండించిన రైతుబిడ్డను. ఊరి పెద్దగా, ఉత్తమ రైతుగా గౌరవించి ముఖ్యమంత్రి కప్పిన పట్టుశాలువా నా భుజం మీద వున్నంతవరకు ఈ ఊరి బాధ్యత మనం మోయాల్సిందే. బాధ్యతన్న తరువాత కొన్ని బాధలు తప్పవు. అంతమాత్రానికే మన జమీందారి పోద్దా?" అన్నాడు శంకరయ్య.

"పేరుకేమో జమిందారు, పూటకు మాత్రం కరువు వెనుకటికొకడు పక్క పుటుక్కున కొరికాడంట. 'ఈ బల్లిపల్లి సంస్థానంలో ఇంత నిర్భయంగా ఎవడ్రా పక్క కొరికింది?' అన్నాడట. కొరికినోడు 'నేనే స్వామి' అన్నాడట భయపడుతూ. 'అయితే సగమిట్టా పంపించూ అన్నాడట' సంస్థానాధీశుడు" శంకరయ్యకు ఒకటే నవ్వు. పార్వతమ్మ కూడా నవ్వుతూ "మన సమస్థానమూ అంతే. తోట, మాగాణి అంతా ఆడుమానం పెట్టి అప్పు తెస్తివి. అది తీరేది కాదు. భూమి మనకు దక్కేది కాదు. పోని పిల్లవాడికైనా మన బాధ చెప్పుకుందామంటే ఒప్పుకోకపోతివి."

శంకరయ్య పార్వతమ్మ వైపు సాలోచనంగా చూస్తూ "నేను వాడికి తండ్రినే, కొడుకును కాదు. వాడు ఏదడిగినా తండ్రిగా ఇంత కాలం యిస్తూనే వచ్చాను. ఇవ్వడంలో వున్న ఆనందం తీసుకోవడంలో వుండదు. అందుకే నేను ఎప్పుడూ ఇస్తూనే వుంటాను. ఆఖరున ఈ వూరిని కూడా వాడికే ఇస్తాను."

రంగుల ప్రపంచానికి దూరంగా ఎక్కడో విసిరేసినట్లుగా వుందావూరు. నవనాగరికతకు సంబంధించిన ఏ అంశమూ ఇంకా ఆ వూరి పొలిమేరలకు చేరలేదు. అందుకే ఆ వూరిలో అందరూ కులమతాలకతీతంగా అన్న, అక్క, అత్త, మామా అంటూ వరుసలు కలుపుకొని ఆప్యాయంగా పిలుచుకుంటూ వుంటారు. వాస్తవంగా శంకరయ్య వాళ్ళకేమీ కాడు, కాని అందరూ ఆయన బంధువులే. అందరికి ఆయన ఆత్మీయుడే. కష్టసుఖాలు కలబోసుకొని జీవితాలలోని వెతలను పంచుకుంటారు. చితికి పోయిన బతుకులకు ఆదరాభిమానాల అతుకులు వేసుకుంటారు.



దాదాపు మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగంలో ఉన్న పిడుగు పాపిరెడ్డి ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం రామగోపాలపురంలో 1939 డిసెంబర్ 17న జన్మించిన పాపిరెడ్డి ఎం.ఎ., ఎంఇడి, సాహిత్య రత్న చేశారు. ఈయన మొట్టమొదటి కథకు 1980లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఉగాది కథల పోటీలో బహుమతి లభించింది. ఇంతవరకు వివిధ పత్రికల్లో 25 కథలు, 50 కవితలు వచ్చాయి.

చిరునామా: పిడుగు పాపిరెడ్డి,
8/137, అప్పయ్యగారివీధి, కొత్తపేట,
కనిగిరి- 523230.

కరువొచ్చి కాలంకాక వ్యవసాయం కొడిగట్టింది. కులవృత్తులన్ని కొండెక్కాయి, పాలకుల పథకాలేవి ఆ పల్లె ఛాయలకు కూడా రావు. చెక్కర, కిరసనాయిలు పట్నానికే పరిమితం. రెండు, మూడు మాసాలకు ఒకసారి బియ్యం మాత్రం వస్తాయి, అవి కూడా తెచ్చిన కొత్తల్లోనే అయిపోతాయి.

బక్కచిక్కిన పేదలు, పస్తులుండే తల్లులు. పాలు రాక కుతి తీరక చీకే పిల్లలు, మంచానికి అతుక్కుపోయిన వృద్ధులు ఈ భయానక వాతావరణాన్ని చూడలేక శంకరయ్య గ్రామస్థుల సహకారంతో గంజి కేంద్రాన్ని ఏర్పాటుచేశాడు. శంకరయ్య పట్టు శాలువా కప్పుకొని, ఉత్తమ రైతు పేరుమీద వున్న వాళ్ళను కలుసుకొని, దాతల దయాదాక్షిణ్యాల మీద బక్క పేగులకింత గంజి పోస్తున్నాడు. మూడు నెలల నుండి రాత్రింబగళ్ళు కప్పుకున్న శాలువ విప్పకుండా, అడిగిన వాడికి అడక్కుండా విరాళాలు వసూలు చేస్తున్నాడు. ఎండా కాలం కూడా ఆయన పట్టు శాలువ ముసుగు తీయడం లేదు. ఆయనే కాదు పార్వతమ్మ కూడా పట్టుచీరలే కడుతుంది.

ఆ రాత్రి ఊరి పెద్దలను పిలిచి నోట్లకట్టలు చేతిలో పెట్టి 'గంజి కేంద్రం నాగా లేకుండా జరపండిరా' అన్నాడు. ఆయకందార్లు ఆస్తి వ్రాయించుకొని అప్పు పోగా మిగతా యిచ్చిన రొఖ్ఖం అది. "కొంతయినా ఖర్చులకుంచుకోండి"అని కోరారు వాళ్ళు. "ఇద్దరికి గుండె జబ్బు" ఎప్పుడు ఏమౌతుందో తెలియదు. మాకెందుకు డబ్బు" అన్నారు.

ఒక రోజు మాపిటాల రామచంద్రయ్యను పిలిచి "చెంబెడు గంజి తెచ్చియ్యరా, మీ సినమ్మ ఉప్పు చూస్తదంట." అన్నాడు శంకరయ్య.

"చిన్నాయనా!" అన్నాడు, కాని నోట మాట రాలేదు.

"అవునురా, మీ సినమ్మ రెండు రోజులైంది ఉప్పు చూడక" గొనిగినట్లుగా అన్నాడు శంకరయ్య.

కోటమ్మ ఘుమఘుమలాడే వంటలతో గిన్నెలు ఇంట్లో పెట్టి పోతుంటే "కోడలు పిల్ల బలే హుషారుగా వుందే"అన్నాడు శంకరయ్య. (మిగతా 18వ పేజీలో)

# తొలి తెలుగు పద్యశాసనం





చెన్నై ప్రభుత్వ మ్యూజియంలో భద్రంగా ఉన్న మన అద్దంకి పద్యశాసనం

సాహితీ సరస్వతికి తొలి తెలుగు పద్యాన్ని అందించిన గడ్డగా అద్దంకి సీమ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. వెయ్యేళ్లకు పైబడిన తెలుగుసాహిత్య చరిత్రలో ప్రకాశం జిల్లా అద్దంకిలో లభించిన అద్దంకి పద్యశాసనం తొలి పద్యమయ శాసనంగా పేరొందింది. అలన్ బట్టర్‌వర్త్, వి వేణు గోపాలరెడ్డి 1905లో ప్రచురించిన ఏ కలక్షన్ ఆఫ్ ద ఇన్‌స్క్రిప్షన్స్ ఆన్ కామర్స్ ప్లేట్స్ అండ్స్ స్టోన్స్ ఇన్ ద నెల్లూరు డిస్ట్రిక్ట్ అనే గ్రంథం రెండో వాల్యూమ్‌లో అద్దంకి పద్యశాసనం గురించి ప్రస్తావన ఉంది. ఈ విషయాన్ని ప్రముఖ చారిత్రక పరిశోధకులు కొమర్రాజు లక్ష్మణరావు పంతులు తొలుత గుర్తించి లోకానికి అందించారు. ఈ శాసనం ప్రాధాన్యతను గుర్తించిన ఆయన ఎపి గ్రాఫికా ఇండికాలో ప్రచురణ కోసం పంపిచారు. 1923 జూన్‌లో చిత్రాడలో జరిగిన ఆంధ్ర పరిశోధక మండలి పంచమ వార్షికోత్సవ సభలో కొమర్రాజు లక్ష్మణరావు పంతులు అద్దంకి పద్యశాసనంలో తరువోజ చందస్సులో పద్యం ఉన్న సంగతి వెల్లడించారు. జయంతి రామయ్యపంతులు, వేటూరి ప్రభాకర శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్య, ఆరుద్ర వంటి ప్రఖ్యాత పరిశోధకులు, పండితులు అద్దంకి శాసనంపై విశేష పరిశోధనలు చేశారు. వేటూరి ప్రభాకర శాస్త్రి అద్దంకి పద్యశాసనం ప్రాధాన్యతను గుర్తించి దానిని చెన్నై ప్రభుత్వ మ్యూజియంలో భద్రపరిచేలా కృషి చేసినట్టు తెలుస్తోంది. మల్లంపల్లిసోమశేఖర శర్మ చెన్నై ప్రభుత్వ మ్యూజియాన్ని సందర్శించి అద్దంకి పద్యశాసననానికి మొట్ట మొదటి ప్రతి బింబాన్ని ప్రచురించారు. అద్దంకిలోని ఒక పెరటిలో శాసన శిలా ఉండేది. దాన్ని గురించి అప్పటి గ్రామధికారి కాకాని కోటయ్యకు ఆ శాసనం లభించినట్టు తెలిసింది. అద్దంకి పద్యశాసనంపై పలువురు విశేష పరిశోధనలు నిర్వహించారు. ఆధారాలను బట్టి క్రీ.శ 848 ప్రాంతానికి చెందినదిగా పరిశోధకులు నిర్ధారించారు. గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు కందుకూరులోని బోయలను జయించి కందుకూరును బెజవాడంత గొప్పగా తీర్చిదిద్ది అనంతరం ఆదిత్య భట్టారకుడు అనే వ్యక్తికి కొంత నేలను దానంగా ఇచ్చినట్టు అద్దంకి పద్యశాసనంలో చెక్కబడి ఉంది. శాసనంలో ఉపయోగించిన లిపి చాళుక్య లిపికి చెందినదని పరిశోధకులు నిర్ధారించరు. ఈ శాసనంలో దేశీయ చందమైన తరువోజ పద్యాన్ని ఉపయోగించారు. తెలుగు భాషలో వేసిన మొట్ట మొదటి పద్యశాసనంగా అద్దంకి పద్యశాసనానికి గుర్తింపు లభించి చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది. చెన్నై ప్రభుత్వ మ్యూజియంలో భద్రపరిచిన అద్దంకి పద్యశాసనానికి ప్రతిరూపం తయారుచేయించి తొలి పద్యం పుట్టిన గడ్డ అయిన అద్దంకిలో ప్రతిష్టిస్తే బాగుంటుందన్న తలుపు కొంతమంది మదిలో కలిగింది. జిల్లాలో అనేక సాహితీ కార్యక్రమాలను నిర్వహించే సృజన సాహితీ సంస్థ ఈ కార్యాన్ని భుజానికెత్తుకుంది. చెన్నై మ్యూజియంలో ఆ శాసనం ప్రతిని సేకరించి ప్రఖ్యాత శిల్పి సెల్వరాజన్ తోడ్పాటుతో అద్దంకి పద్యశాసనానికి ప్రతి లేఖనాన్ని సృజించి అద్దంకి కమలేశ్వరస్వామి ఆలయం ముందు స్థలంలో ఇటీవల ఒక స్థూపం నిర్మించి దానిపై అద్దంకి పద్యశాసనాన్ని ప్రతిష్టించారు. దీన్ని 2005 ఆగస్టు 19న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసన కర్త పండరిరంగని స్మృత్యర్థం అద్దంకి పద్యశాసనం పేరిట ఒక విలువైన వ్యాస సంకలనాన్ని కూడా సృజన నిర్వాహకులు వెలువరించారు. క్రీస్తు శకం 8వ శతాబ్ది నాటి తెలుగుభాష ఎలా ఉండేదో తొలి తెలుగు పద్యాన్ని జాతికి, సాహితీ భారతికి కానుకగా అందించిన ఘనత ప్రకాశం జిల్లాకే దక్కుతుంది.

**- పీసపాటి సంపత్‌కుమార్**

---

**(9వ పేజీ తరువాయి)**

"దానికేం వుండక"అన్నది పార్వతమ్మ కూడా నవ్వుతూ.

కోటమ్మ నవ్వలేదు. తలవంచుకొని వెళ్ళిపోయింది, తల యెత్తితే కళ్ళు కాల్వలైతాయని భయం. కడుపు నిండా తిని కంటి నిండా నిద్రపోయారు.

ఆ రెండు హంసలు జంటగా ఏ యరకాడ ఎగిరిపోయాయో యెవ్వరికీ తెలియదు.

తెల్లవారేసరికి ఈ వార్త వూరంతా గుప్పుమంది. పగిలిన పుట్టలోనుండి బయటికి వస్తున్న చీమల్లా జనం. పట్టుశాలువా వంటి నిండా కప్పుకొని పండబెట్టిన నిండు విగ్రహంలా వున్నాడు శంకరయ్య. పక్కనే పట్టు చీరలో పార్వతమ్మ.

కొడుకుకు ఫోన్ చేయమని పక్కన వున్న పట్టణానికి మనిషిని పంపారు. ఆయన అందరాలేదని అందరికి తెలుసు. ఏం చేద్దాం అన్నట్లు జనమంతా సందిగ్ధంలో పడ్డారు. అంతలో ఒకడన్నాడు "ఆయన కృష్ణమూర్తినే కాదు మనల్ని కూడా బిడ్డల మాదిరి సాకిండు. మనమే చేద్దాం ఖర్మ." కర్తవ్యం బోధపడినట్లు అందరూ ఎవరి పనివారు చేయడం మొదలుపెట్టారు. "ఆగండిరా"అన్నా వినకుండా దేవిగాడి ముఠా తప్పెట్లు వాంచుతున్నారు. మేళగాండ్లు సొంత పెండ్లిలా సన్నాయి వూదుకున్నారు.

శంకరయ్యను మోసకొచ్చి, మొత్తకానించి నీళ్ళు పోయటానికి శాలువా తీశారు. అంతే తప్పెట్లు ఆగిపోయాయి మేళతాళాలు మూగబోయాయి. జనమంతా శిలప్రతిమల్లా నిలబడిపోయారు.

శంకరయ్య వంటి మీద చొక్కా లేదు. ముని చేతివరకు చేతులు, మెడ మీద పట్టీ తప్ప మిగతా చొక్కా అంతా శరీరానికి దిగేసిన పేలికల్లా వున్నాయి. తోలు చుట్టిన ఎముకల గూడులా వుంది శరీరం. వూరు బాధ్యతగా వంటి మీద కప్పుకున్న శాలువా ఆఖరిదాకా ఆయనకు అండగా వుంది. పట్టు గుడ్డలు పగలు రాత్రి వదలకుండా ఎందుకు చుట్టుకున్నారో అర్థమై జన సంద్రం శోక సముద్రమైంది. నిశబ్దాన్ని చీల్చుకుంటూ ఎదలోని బాధ బయటకు వచ్చిందేమో అన్నట్లు జన సమూహం ఉత్తుంగ తరంగంలా లేచింది.

అది శవయాత్రలా లేదు, దేవతాప్రతిష్టలా సాగింది.

కారు దిగిన కొడుకు జనం మధ్య దారి చేసుకుంటూ గుడిలాంటి యింట్లో కాలు పెట్టాడు. ఎదురుగా రెండు జ్యోతుల మధ్య పరంజ్యోతుల్లా వెలుగుతున్న శంకరయ్య పార్వతమ్మ ఫొటోకు దండ వేసి, పక్కనున్న శాలువా తీసి వంటి నిండా కప్పుకున్నాడు క్రిష్ణమూర్తి.

★